క్లుప్తంగా

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో రాణాప్రతాప్



రాణాప్రతాప్‌ను సన్మానిస్తున్న శ్రీశ్రీ కళావేదిక చైర్మన్, సభ్యులు

హిరమండలం: ఈ నెల 19, 20వ తేదీలలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ప్రపంచ తెలుగు సాహిత్య–కళాజాతర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రుగడ గ్రామానికి చెందిన యువకవి, రచయిత ఐ.రాణాప్రతాప్ పాల్గొని బోధనా భాషగా తెలుగు అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు. దీనికి గాను అభినందిస్తూ తెలుగు సాహితీ కళా చరిత్రలో 24 గంటల 24 నిమిషాల 24 సెకన్ల పాటు నిర్విరామంగా నిర్వహించిన రికార్డ్‌గా గుర్తించి అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ నంబర్‌వన్, తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ), కల్చరల్ టాలెంట్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో రాణాప్రతాప్ పేరును నమోదు చేస్తున్నట్లుగా ధ్రువీకరించారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందించారు. రాణాప్రతాప్‌కు కవులు, రచయితలు గ్రామస్తులు అభినందించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా మధు



సారవకోట: స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా మధు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏఈ శ్రీనివాసరావు పోలాకి మండలానికి బదిలీపై వెళ్లారు. సంతబొమ్మాళి మండలం నుంచి మధు ఇక్కడకి బదిలీపై వచ్చారు. ఎంపీడీఓతో మండలంలోని పలు ఆర్‌డబ్ల్యూఎస్ పనులపై చర్చించారు.

ప్రభుత్వానికి పట్టని ప్రజల ఆరోగ్యం



చింతాడ సూర్యనారాయణ

కొత్తూరు: ప్రజల ఆరోగ్యం కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని కొత్తూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ప్రజా సమస్యలు పట్టడం లేదని విమర్శించారు. విజయనగరం జిల్లా గుర్ల మండలంలో డయేరియాతో 11 మంది మృతికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. ఇసుక ర్యాంపులు, మద్యం షాపుల సర్దుబాటులో సీఎం చంద్రబాబు, ఆ పార్టీ పెద్దలు బిజీగా ఉన్నారు తప్ప.. ప్రజల ఆరోగ్యం పట్టడం లేదన్నారు. రైతులకు ఎరువులు ఇవ్వలేని కూటమి ప్రభుత్వం.. ప్రైవేట్ మద్యం షాపులను తీసుకువచ్చి గ్రామాల్లో బెల్టు షాపులను ఏర్పాటు చేస్తోందని ఆరోపించారు.

పరామర్శ..



సురేష్‌ను పరామర్శిస్తున్న సువ్వారి గాంధీ, తదితరులు

బూర్జ: మండలంలోని గుత్తావల్లి గ్రామానికి చెందిన సనపల సురేష్‌కు ఆమదాలవలస స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ సోమవారం పరామర్శించారు. ఇటీవల ఎమ్మెల్యే కూన రవికుమార్ అనుచరుల దాడిలో సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. గుత్తావల్లి వెళ్లి దాడికి గల కారణాలను గాంధీ అడిగి తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరామర్శించిన వారిలో సువ్వారి అనిల్, పి.సూర్యారావు, పైడి విజయ, ప్రశాంత్, మోహన్ చౌదరి, సైరిగాపు శివ, సూర కిరణ్, జి.రాజశేఖర్, కోరాడ శ్రీను తదితరులు ఉన్నారు.

వసతి గృహం తనిఖీ



విద్యార్థితో మాట్లాడుతున్న జడ్జి జ్యోత్స్న

పొందూరు: మండలంలోని రాపాక సమీపంలో గల ఎంజేపీ పాఠశాల వసతి గృహాన్ని పొందూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.జ్యోత్స్న సోమవారం తనిఖీ చేశారు. ఇంటికి దూరంగా ఉంటున్న చిన్నారుల ఆరోగ్యం అంత్యంత ముఖ్యమన్నారు. వసతి గృహంలో వంటగది, వంట సామగ్రిని పరిశీలించారు. వసతి గృహం సౌకర్యాలపై విద్యార్థులతో మాట్లాడారు. న్యాయవాదులు ఎం.రాము, కె.అశోక్, టి.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టెట్

నరసన్నపేట: స్థానిక కోర్ టెక్నాలజీలో నిర్వహించిన టెట్ సోమవారంతో ముగిసినట్లు ఎంఈఓ దాలినాయుడు తెలిపారు. మొత్తం 10,095 మందికి కేటాయించగా 8,994 మంది హాజరయ్యారన్నారు. రాష్ట్ర పరిశీలకునిగా ఉన్న సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు విజయ్‌భాస్కర్, డిప్యూటీ ఈఓ వియజకుమారి తదితరులు పరీక్షలను పర్యవేక్షించారన్నారు.

వచ్చేస్తున్నాయ్..

స్మార్ట్ మీటర్లు!

- నేటి స్మార్ట్ మీటర్లే.. రేపటి ప్రీపెయిడ్‌గా మార్పు..
- ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థల్లో ఏర్పాటు
- సింగిల్ ఫేజ్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు..

నియోజకవర్గంలో విద్యుత్ సర్వీసులు, స్మార్ట్ మీటర్ల లక్ష్యం ఇలా..

మండలం	సర్వీసులు	స్మార్ట్ మీటర్ల లక్ష్యం
నరసన్నపేట టౌన్	15,895	3,456
నరసన్నపేట రూరల్	15,284	1,209
జలుమూరు	19,322	1,768
పోలాకి	22,257	1,955
సారవకోట	15,907	1,588



నరసన్నపేట ఎంపీడీఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో అమర్చిన స్మార్ట్ మీటర్

నరసన్నపేట: నేటి స్మార్ట్ విద్యుత్ మీటర్లే రేపటి ప్రీపెయిడ్‌గా మారనున్నాయి. వీటిని ఏర్పాటు చేసేందుకు విద్యుత్ సంస్థలు చర్యలు వేగవంతం చేస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలు, కేటగిరీ–2లకు(వ్యాపార సంస్థ) మీటర్లను మార్చుతున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో శుక్రవారం నాటికి 902 స్మార్ట్ మీటర్లు పెట్టారు. స్థానికంగా ఉన్న విద్యుత్ సిబ్బంది సహకారంతో అదానీ సంస్థ ప్రతినిధులు వచ్చి మీటర్లను బిగిస్తున్నారు. ప్రస్తుతం స్మార్ట్ మీటర్లే తరువాత ప్రీపెయిడ్‌గా అవుతాయని విద్యుత్ సిబ్బందే బాహాటకంగా చెబుతున్నారు. ఇప్పటి వరకూ వినియోగించిన విద్యుత్‌కు యూనిట్ల ఆధారంగా మనం డబ్బులు కడుతున్నాం. స్మార్ట్ మీటర్లలో ముందస్తుగా రీచార్జ్ చేసుకుని ఆ మేరకే విద్యుత్ వినియోగించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం మనం సెల్‌ఫోన్లకు ప్రీపెయిడ్ పద్ధతిలో ఎలా రీచార్జ్ చేస్తున్నామో అలాగే ముందస్తుగా చెల్లించి విద్యుత్‌ను కూడా వాడుకోవాల్సి ఉంటుంది.

రీడింగ్ తీయనక్కర్లేదు..

గతంలో మాన్యువల్ మీటర్లు ఉండేవి. వాటిని చూసి రీడింగ్ రాసుకునేవారు. తర్వాత ఐడీఆర్ అంటే స్కాన్ చేస్తే రీడింగ్ ఆటోమెటిక్‌గా రికార్డు అయ్యేది. దీని ద్వారా వినియోగదారునికి బిల్లు వచ్చేది. ఇప్పటి స్మార్ట్ మీటర్‌కు రీడింగ్ తీయనక్కర్లేదు. ప్రతీ నెలా అదే రీడింగ్ రికార్డు చేస్తుంది. ఒకటో తేదీ నాటికి వినియోగదారునికి బిల్లు వస్తుంది.

త్వరలో అన్ని కనెక్షన్లకు..

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాట్లను ముమ్మరం చేసింది. త్వరలోనే అన్ని సర్వీసులకూ ఈ మీటర్లు అమర్చుతారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి నాటికి అన్ని సర్వీసులకూ ఈ మీటర్లు ఏర్పాటు జరుగుతుందని విద్యుత్ సిబ్బంది అంటున్నారు. ఈ మీటర్లకు రీచార్జి చేయకపోతే ఆటోమేటిక్‌గా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఈ నెల వినియోగించిన విద్యుత్ బిల్లును మరుసటి నెలలో చెల్లించడం, బిల్లు వచ్చిన 15 రోజులలోగా కడుతున్నాం. అసరాధ రుసుంతో కూడా కట్టేందుకు మరికొంత సమయం ఉంటుంది. ఈ విధానానికి అలవాటు పడిన వినియోగదారులకు దీనిపై పూర్తి అవగాహన కల్పించాలి.

కేటగిరీ–2 సర్వీసులకు మీటర్లను మార్చుతున్నాం..



విద్యుత్ సంస్థల ఆదేశాల మేరకు ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలకు కేటగిరీ–2 మీటర్లను మార్చుతున్నాం. వీటిని మార్చడం ద్వారా వినియోగదారునికి ఎటువంటి ఆర్థిక భారం ఉండదు. నరసన్నపేట డివిజన్ పరిధిలో 642 మీటర్లు ఏర్పాటు చేశాం. అదానీ కంపెనీ వారే వచ్చి మీటర్లు అమర్చుతున్నారు.

– ఇందిర, విద్యుత్‌శాఖ ఏడీ, నరసన్నపేట

గిరిజన గ్రామాల సమస్యలు పరిష్కరించాలి



గొట్టిపల్లిలో ఆందోళన చేస్తున్న గిరిజనలు

కొత్తూరు: మండలంలోని గొట్టిపల్లి, అడ్డంగితో పాటు పలు గిరిజన గ్రామాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాదరావు, మండల నాయకుడు నిమ్మక అప్పన్న డిమాండ్ చేశారు. గొట్టిపల్లిలో సోమవారం గిరిజనులతో సమావేశం నిర్వహించారు. మెట్టూరు నుంచి గొట్టిపల్లికి బస్ సౌకర్యం పునరుద్ధరించాలన్నారు. పల్లగూడ, గొట్టిపల్లి గిరిజన గ్రామాలకు ఉమ్మడిగా ఉన్న శ్మశానానికి రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. డెప్పిగూడ నుంచి దిగువమల్లిల గూడ వరకు రోడ్డు బాగు చేయాలన్నారు. అడ్డంగి, గొట్టిపల్లిలో సామాజిక భవనాలు నిర్మించాలన్నారు. కొండలపై ఉన్న గిరిజన గ్రామాల రోడ్డులకు రక్షణ గోడలు నిర్మించాలని కోరారు. గిరిజనలకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించాలన్నారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళలపై దాడి హేయమైన చర్య



మాట్లాడుతున్న గిరిజన సంఘం నేతలు

మెళియాపుట్టి: జలుమూరు మండలంలోని మాకివలస గ్రామానికి చెందిన గిరిజన మహిళలపై శనివారం రాత్రి దాడి చేయడం హేయమైన చర్య అని మండలానికి చెందిన పలువురు ఆదివాసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీ సంఘం మండల సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు ఎస్.గణేష్ సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. పలువురు వ్యక్తులు దౌర్జన్యంగా మాకివలస గ్రామంలోనికి చొరబడి మహిళల వస్త్రాలను చించి దాడికి తెగబడటం బాధకరమన్నారు. దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సమాజం విస్తుపోయే సంఘటన జరిగితే స్థానికంగా ఉండే ఎమ్మెల్యే స్పందించక పోవడం బాధాకరమన్నారు. మాకివలస గిరిజన ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి సవర వెంకటేష్, సవర ధర్మారావు, బంకి భాస్కరరావు, సవర లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వంట ఏజెన్సీ మార్పు



నరసన్నపేట: సమావేశంలో పాల్గొన్న అధికారులు, ఎస్‌ఐ, తదితరులు

నరసన్నపేట: మండలంలోని బాడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ ఎంపిక ప్రక్రియ సోమవారం పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ స్కూల్లో ఎండీఎం ఏజెన్సీని మార్చాలని టీడీపీ, జనసేన కార్యకర్తలు పట్టుబట్టారు. ప్రస్తుతం ఉన్న రామా వంట ఏజెన్సీనే కొనసాగించాలని, వారు చేసిన తప్పేమిటని సర్పంచ్ డోల గోవిందరావు, తదితరులు అధికారులను ప్రశ్నించారు. ఈ దశలో విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవడానికి అధికారులు నిర్ణయించి సమావేశం ఏర్పాటు చేశారు. అత్యధికం మంది ప్రస్తుతం ఉన్న వంట ఏజెన్సీని మార్చాలని, సంతోషిమాత గ్రూప్‌నకు వంట బాధ్యతలు అప్పగించాలని తీర్మానించారు. నవంబర్ నుంచి సంతోషి మాత గ్రూప్ మహిళలు వంట చేస్తారని ఎంఈఓ శాంతారావు ప్రకటించారు. ఈ స్కూల్లో 98 మంది విద్యార్థులు ఉన్నారు. గ్రామంలో వివాదం జరగవచ్చనే అనుమానంతో నరసన్నపేట ఎస్‌ఐ దుర్గాప్రసాద్, ఏఎస్‌ఐ అశిరినాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్, హెచ్‌ఎం, విద్యా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వంట ఏజెన్సీ తొలగింపు..

సారవకోట: మండలంలోని బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వంట ఏజెన్సీని తొలగించినట్లు ఎంఈఓ నోటీసులు జారీ చేశారు. ఈ పాఠశాలలో 14 ఏళ్ల నుంచి గ్రామానికి చెందిన వంట ఏజెన్సీ విధులు నిర్వర్తిసున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ వంట ఏజెన్సీని తొలగించేందుకు అధికారులపై టీడీపీ, జనసేన నాయకులు ఒత్తిడి తీసుకువచ్చారు. పాత ఏజెన్సీ సభ్యులు వంట చేయడానికి రావద్దని, కొత్త వారికి అవకాశం ఇచ్చామని ఎంఈఓ రమణ ఇటీవల చెప్పారు. పాత ఏజెన్సీ సభ్యులు కూడా తమకు ఎటువంటి నోటీసులు జారీ చేయకుండా మమ్మల్ని ఏ విధంగా వంట చేసేందుకు రావద్దని చెబుతారని నిలదీశారు. వంట ఏజెన్సీని తొలగిస్తున్నట్లు ఎంఈఓ నోటీసు ఇచ్చారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని పాత వంట ఏజెన్సీ సభ్యులు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాపై అవగాహన కల్పిస్తున్న బి.కె.మంజునాథ్

మెళియాపుట్టి: మానసిక ప్రశాంతత, చక్కటి ఆరోగ్యం కోసం ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతోపాటు యోగా చేయాలని బెంగుళూరు నుంచి వచ్చిన ఆధ్యాత్మిక గురువు రాజయోగి బి.కె.మంజునాథ్ అన్నారు. సోమవారం చాపర గ్రామంలోని త్రిలోక్ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో యోగాపై అవగాహన కల్పించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానసికంగా, శారీరంగా పడుతున్న ఇబ్బందులు తొలగించడానికి ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత అవసరమన్నారు. దానికి సంబంధించి ఆధ్యాత్మిక అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించడానికి, ఆరోగ్యం పట్ల తీసుకోవల్సిన శ్రద్ధ, క్రమశిక్షణ గూర్చి వివరించారు. ఆరోగ్యాన్ని చక్కదిద్దుకోవడం కోసం ఆహారపు అలవాట్లు, యోగా, ధ్యానం అవసరమన్నారు. బ్రహ్మ కుమారీలు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న ఎం.కె.మిశ్రో, అంబిక, విద్యార్థులు

ఎల్.ఎన్.పేట: విధి నిర్వాహణలో ప్రాణాలను పణంగా పెట్టిన అమరులైన పోలీసు వీరుల త్యాగాలను ఎప్పటికీ మరచిపోలేమని లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్ పర్సన్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం.కె మిశ్రో అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం లక్ష్మీనర్సుపేట గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల (కేజీబీవీ)లో పోలీసు అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ ఎం.వి.అంబిక, బోధన, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

హిరమండలం: మండలంలోని పలు సమస్యలను పరిష్కరించాలని టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తికి స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు సోమవారం వినతిపత్రం అందించారు. వంశధార నిర్వాసితులకు గత ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు పరిహారం కొంతమందికి అందలేదని, అటువంటి వారికి మంజూరు చేయాలన్నారు. పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని, నిర్వాసిత గ్రామాల్లోని మిగులు భూములకు సాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. రెవెన్యూ వెబ్‌ల్యాండ్‌లో మిగులు భూములు నమోదు చేయాలన్నారు. సుభలయ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కోరాడకు చెందిన 93 మంది నిర్వాసితులకు రెండు సెంట్లు పునరావాస స్థలం మంజూరు చేశారని, మిగిలిన మూడు సెంట్ల స్థలం, దాని విలువ మేరకు నగదును ఇవ్వాలన్నారు.

అక్షరాస్యతపై ప్రత్యేక దృష్టి

నరసన్నపేట: మండలంలో 1,360 మంది నిరక్షరాస్యులు ఉన్నారని వారిని 'ఉల్లాసం' అనే కార్యక్రమం ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ మధుసూదనరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో అంగనవాడీ కార్యకర్తల ప్రాజెక్టు సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు దీనిపై దృష్టి పెట్టాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అక్షరాస్యతపై లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామాల్లో యువకులు, విద్యావంతులు, విశ్రాంత ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిరక్షరాస్యులను దత్తత తీసుకుని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కోరారు. పీఓ నాగమణి, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

మార్కెటింగ్ చేసుకోవాలి

హిరమండలం: మహిళా సంఘాలు తమ ఆదాయ అభివృద్ధి కార్యక్రమాల కోసం పొందిన రుణాల ద్వారా చేపడుతున్న ఉత్పత్తులన్నింటికీ మార్కెటింగ్ చేసుకోవాలని వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు అన్నారు. సోమవారం మండలంలోని కొండరాగోలు, గులుమూరు పంచాయతీల్లో పర్యటించారు. సంఘాల పనితీరు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ఉత్పత్తులు మార్కెటింగ్ చేసుకోవడానికి ప్రభుత్వం నూతనంగా ఆన్‌లైన్ డిజిటల్ కామర్స్ విధానం (ఓఎన్‌డీసీ) అమలులోకి తెచ్చిందన్నారు. ప్రతీ సంఘం కూడా ప్రగతికి పది సూత్రాలను పాటించేలా సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. ప్రతీ స్వయంశక్తి సంఘం తమ సొంత నిధులను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. పొదుపు నుంచి అప్పులు ఇచ్చుకుంటే తద్వారా వచ్చే వడ్డీ సభ్యులందరికీ చెందుతుందని వివరించారు. ప్రతీ సంఘ సభ్యురాలకు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీనిధి బ్యాంక్ నుంచి అవసరం మేరకు రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ అప్పలస్వామి, వీఓఏలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఎల్.ఎన్.పేట: రైతులతోపాటు ఇతర వర్గాల వారినుంచి వచ్చిన ప్రతీ ఫిర్యాదును పరిష్కరించే బాధ్యత మనపైనే ఉందని తహసీల్దార్ జె.జయలక్ష్మి అన్నారు. తన కార్యాలయంలో సోమవారం రెవెన్యూ ఉద్యోగులతో సమావేశమయ్యారు. భూ రీసర్వే జరిగిన తరువాత వచ్చే సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతుల సమస్యను తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. ఈ నెల 22వ తేదీ వచ్చే నెల 18వ తేదీ వరకు జరగనున్న రెవెన్యూ సదస్సుల్లో రైతులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఆర్‌ఐ గవరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

బూర్జ: మండలంలోని కొల్లివలస డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు 20 మందికి క్రీడా దుస్తులను జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి తూర్పుకాపు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్ల జయరాం సమకూర్చారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ దువ్వాడ దేవేంద్రరావు ఆధ్వర్యంలో దుస్తులను పంపిణీ చేశారు. రానున్న జోనల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌కు వెళ్లనున్న విద్యార్థులకు స్పోర్ట్స్ ట్రాక్‌లు, టీ షర్టులు అందజేశారు. విద్యాలయానికి 10 ఎల్‌ఈడీ బల్బులు వితరణ చేశారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పాడైన బోరు ప్లాట్‌ఫాం



సరుబుజ్జిలి మండలంలోని విజయరాంపురం గ్రామంలో బోరు ప్లాట్‌ఫాం పూరిగా పాడైపోయింది. బోరు చుట్టూ మురుగు నీరు, వర్షం నీరు చేరుతోంది. తాగునీరు కలుషితమయ్యే ప్రమాదముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే బాగుచేయాలని కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

మురుగునీటితో అవస్థలు



ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు పార్వతీశ్వరునిపేట ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ఈ ప్రాంత వాసులు నిత్యం దుర్వాసనలతోపాటు దోమలతో ఇక్కట్లకు గురౌతున్నారు. ఆమదాలవలస–పాలకొండ లింక్ రోడ్డు కావడం, ఈ రోడ్డులో పాఠశాలలు ఉండడంతో విద్యార్థులు, ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– ఆమదాలవలస

కుక్కలతో బెడద



కొత్తూరులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రాత్రీ, పగలు తేడాలేకుండా గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. కొత్తూరులో 15 రోజుల క్రితం 10 మందిని గాయపరిచాయి. చిన్నారులు, వృద్ధులు రాత్రి వేళల్లో బయటకు రావడానికి భయపడుతున్నారు. కుక్కలను గ్రామం నుంచి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– కొత్తూరు

ప్రమాదకరం..



మబగాం నుంచి ఈదులవలసకు వెళ్లే మార్గంలో ఆర్ అండ్‌బీ రహదారిపై కిల్లాం వద్ద పోలాకి ఓపెన్ హెడ్ చానల్ ఆనుకుని ఉన్న రైలింగ్ శిథిలమైంది. వాహనాలు అదుపు తప్పితే కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. కొత్తవారు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని, రైలింగ్‌ను పటిష్టం చేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

– నరసన్నపేట

నేటినుంచి గ్రామ సభలు

ఎల్.ఎన్.పేట: ఈ నెల 22 నుంచి రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు జయలక్ష్మి సోమవారం తెలిపారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం ఉంటుందన్నారు. 22న బొత్తాడసింగి, 23న పూశాం, 24న రావిచంద్రి, 25న ధనుకువాడ, చిట్టిమండలం, సోమనాథపురం గ్రామాలకు ధనుకువాడలో, 26న వాడవలస, 28న మిరియాపల్లి, 29న పెద్దకోట సచివాలయం–1లో జంగావలస, 30న పాలవలస, నవంబర్ 2న మోదుగువలస (ఆర్‌ఆర్ కాలనీ చిన్నకొల్లివలస) రెవెన్యూ గ్రామాలకు పెద్దకొల్లివలస సచివాలయం వద్ద, 4న వెంకంపేట, స్కాట్‌పేట, పెద్దకొల్లివలస రెవెన్యూ గ్రామాలకు పెద్దకొల్లివలస, 5న గొట్టిపల్లి, 6న కొమ్మువలస, 7న దబ్బపాడు, 8న తురకపేట, కృష్ణాపురం, 11న జంబాడ సభను బొర్రంపేట సచివలయం వద్ద, 12న బొరమాంబాపురం, 13న బొర్రంపేట, వలసపాడు, 14న సిద్ధాంతం, బరటాం, 15న ముంగెన్నపాడు, మల్లిఖార్జునపురం, 16న శ్యామలాపురం, కరకవలస, 18న చింతలబడవంజ, డొంకలబడవంజ, కవిటి గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు వారి భూములకు సంబంధించి సమస్యలు ఉంటే రాతపూర్వకంగా అన్ని అధారాలతో ఫిర్యాదులు చేసుకోవచ్చని సూచించారు.

జలుమూరు: రీసర్వే జరిగిన గ్రామాలలో భూ సమస్యలు ఉంటే ఈ నెల 22 నుంచి నవంబర్ 23 వరకు గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దార్ జెన్ని రామారావు తెలిపారు. ఈ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నరసన్నపేట: రెవెన్యూ గ్రామ సభలను వినియోగించుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. 22న యరబాడు, 23న బాడాం, 24న తోటాడ, 25న నారాయణవలస, 26న కంబకాయ, 28న ఉర్లాం, 29న సుందరాపురం, 30న తామరాపల్లి, నవంబర్ 1న కొబగాం, 2న చిక్కాలవలస, 4న చిట్టివలస, 5న రెల్లివలస, 6న దేవాది, 7న కరగాం, 8న రావులవలస, 11న నరిసింగపల్లి, 12న మామిడివలస, 13న కుద్దాం, 14న మాకివలస, 15న దశుమంతుపురం, 16న బసివలస, 18న బాలసీమ, 19న పారశిల్లి, 20న శ్రీరాంపురం, 21న నర్సింగరాయుడుపేట, 22న గోకయ్యవలస, 23న వెంకటాపురం, 24న బొరిగివలసల్లో గ్రామ సభలు ఉంటాయన్నారు.

పాతపట్నం: మండలంలోని ఈ నెల 22 నుంచి నవంబర్ 16వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. 22న ఎ.ఎస్.కవిటి, 23న ఎస్.ఎస్.మనుగు, 24న ఆర్.ఎల్.పురం, 25న చిన్నమల్లిపురం, 26న జగ్గిలిబొంతు, 28న బైదలాపురం, 29న సోద, 30న, నవంబర్ 1న (రెండు రోజులు) స్టువర్ట్‌పేట, 2న రొంపివలస, 4న పెద్దసున్నాపురం, 5న పాతపట్నం–2, 6న బూరగాం, 7న పాతపట్నం–1, 8న కొదూరు, 11న సీది, 12న తామర, 13న తీమర, 14న చంగుడి, 15న సరాలి, 16న దశరథపురం గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు.

కొత్తూరు: ఈ నెల 22 నుంచి నవంబర్ 8 తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.రవిచంద్ర తెలిపారు. 22న వసప, సందిపాలెం, 23న మహేర్తాపురం, 24న దిమిలి, 25న కురిగాం, 26న బలద, 28న ఇరపాడు, 29న ఆకులతంపర, 30న చొంప, కుద్దిగాం, నవంబర్ 1న కాకరగూడ, బొడ్డగూడ, 2న పాతపాడు, 4న సోమరాజపురం, 5న లబ్బ, 6న కర్లెమ్మ, 7న సోమరాజపురం, 8న మెట్టూరు బిట్–3 ఆర్‌ఆర్ కాలనీల్లో సభలు ఉంటాయన్నారు.

నేటినుంచి ఆధార్ క్యాంపులు

సరుబుజ్జిలి: ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు సచివాలయాల్లో నిర్వహించనున్న ఆధార్‌స్పెషల్ డ్రైవ్‌ను వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఎం.పావని సోమవారం ప్రకటనలో వెల్లడించారు. 22న చినకాగితాపల్లి, 23 మతలబుపేట, 24 రొట్టవలస, 25 చిగురువలస సచివాలయాల వద్ద ఆధార్ క్యాంపులు ఉంటాయన్నారు.

నరసన్నపేట: మండలంలో ఏర్పాటు చేయనున్న ఆధార్ ప్రత్యేక శిబిరాలను వినియోగించుకోవాలని ఎంపీడీఓ మధుసూదనరావు కోరారు. ఈ నెల 22, 23 తేదీల్లో చెన్నాపురం, కోమర్తి, జమ్ము, మాకివలసల్లో, 24, 25వ తేదీల్లో చోడవరం, ఉర్లాం, బొరిగివలస, గోపాలపెంటలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఆధార్ కొత్తగా చేసుకోవాలన్నా, పేర్లు, ఫొటోలు, అడ్రస్ వంటి వివరాలు మార్చుకోవచ్చన్నారు.